# 4

# యేసు, దేవుని కుమారుడు

యేసు క్రీస్తు దేవుని కుమారుడనే సత్యం క్రైస్తవ్యం యొక్క కేంద్రమందు నిలిచి యుంది. మన విశ్వాసానికి క్రీస్తు కేంద్రమైయున్నాడు. ఆయన మన విశ్వాసానికి పునాదియు (1 కొరింథీ. 3:11), మన ప్రకటనకు అంశమును (అపొ. 8:35; 1 కొరింథీ. 1:23), మన ఒప్పుకోలునకు వస్తువును (మత్తయి 10:32), మన నిరీక్షణకు ఆధారమునైయున్నాడు (1 తిమోతి 1:1). అందువలన, ఆయనయందు బలమైన విశ్వాసముండడం అవసరం (యోహాను 8:24). క్రీస్తు యొక్క దేవత్వమందు విశ్వసించడానికి మనకు అనేక మంచి కారణాలున్నాయి. విశ్వసించడానికి సమృద్ధియైన రుజువును అనుగ్రహించకుండ నమ్మమని దేవుడు మనలను అడగడం లేదు (యోహాను 20:31). రుజువు బలమైనది, శతాబ్దాల తరబడి వేలకొలది జనులను అది నమ్మేలా చేస్తుంది. యేసు దేవుని కుమారుడని విశ్వసించడానికి ఈ పాఠము కొన్ని రుజువులను చూపుతోంది. వాటిని జాగ్రత్తగా పరిశీలించు. నీకు యింతక మునుపే బలమైన విశ్వాస మున్నట్టయితే, "ప్రభువా నా విశ్వాసాన్ని అధికం చేయుమని" ఆయన శిష్యులవలె ప్రార్థించు. నీవు సందేహాలచేత బాధింపబడుతుంటే, దయ్యంపట్టిన బిడ్డయొక్క తండ్రివలె, "నమ్ముచున్నాను, నాకు అపనమ్మకముండకుండ సహాయము చేయుమని ప్రార్థించు" (మార్కు 9:24ఎ).

### ఆయన పాత నిబంధన ప్రవచనాలను నెరవేర్చినవాడు గనుక

ప్రభువైన యేసు యొక్క జన్మకు వందల సంవత్సరాల పూర్వమే చేయబడిన కొన్ని ప్రవచనాలను ఆలోచించు. ఆయన జన్మ ప్రవచింపబడింది. ఆయన వంశావళి అబ్రాహాము, యూదా, దావీదులతో కూడియుంది (ఆది. 12:3/మత్తయి 1:2;

ఆది. 49:10/మత్తయి 1:2, 6). అబ్రాహాము సంతతివారు అనేకులున్నారు, అయినా, ఆ కుటుంబం కూడా ప్రవచనంలో సూచింపబడింది (యిర్మీయా 23:5; యెషయా 11:1/మత్తయి 1:6). ఆయన కన్యగర్భమందు జన్మిస్తాడని యెషయా 7:14లో ముందుగా చెప్పబడి, మత్తయి 1:18-25లో నెరవేర్చబడింది. బేత్లెహేము ఆయన జన్మ స్థలముగా కోరుకోబడింది (మీకా 5:2). అంతేగాక, ఆయన జన్మ వెంట అనేకమంది పసిబిడ్డలు చంపబడతారని కూడా ప్రవచింపబడింది (యిర్మీయా 31:15/మత్తయి 2:16-18).

ఆయన ఐగుప్తుకు పారిపోయే విషయాన్ని కూడా ప్రవక్తలు ముందుగానే తెలిపారు (హోషేయ 11:1/మత్తయి 2:13-15), గలిలయలోని ఆయన జీవితాన్ని గూర్చి (యెషయా 9:1, 2/మత్తయి 4:12-16), ఆయన యెరూషలేము లోనికి విజయోత్సవపు ప్రవేశము (జెకర్యా 9:9/మత్తయి 21:1-11) అనేవి ముందుగానే సూచింపబడ్డాయి. ఆయన పని సహితము ప్రవచింపబడింది. ఆయనకు ముందుగా మార్గం సిద్ధపరచేవాడు వస్తాడని ప్రవక్తలు తెలిపారు (మలాకీ 3:1; యెషయా 40:3/మత్తయి 3:1-3). స్వస్థపరచే ఆయన పరిచర్యను గూర్చియు (యెషయా 53:4/మత్తయి 8:16, 17), ఉపమానాలతో ఆయన చేసే బోధను గూర్చియు (యెషయా 6:9, 10/మత్తయి 13: 10-17), అన్యజనుల మధ్య ఆయన పనిని గూర్చియు (యెషయా 42:1-4/ మత్తయి 12:15-21), ఏలికలచే ఆయన నిరాకరింపబడుటను గూర్చియు (కీర్తన. 118:22/యోహాను 1:11) వారు ముందుగానే పలికారు.

ప్రభువైన యేసు యొక్క మరణం ప్రవచనంలో ఎక్కువ వివరంగా యివ్వబడింది. తన స్నేహితునిచే (కీర్తన. 41:9/మత్తయి 26:47-50) ఆయన ముప్పది వెండి నాణ్యాలకే (జెకర్యా 11:12/మత్తయి 26:14-16) అప్పగింపబడతాడని పాత నిబంధన చిత్రించింది. ఆయన తన శత్రువుల ఎదుట ఎలా ప్రవర్తిస్తాడో (యెషయా 53:7/ మత్తయి 27:12, 14), ఆయన ఎలా మృతిపొందుతాడో (కీర్తన. 22:16 /మత్తయి 27:35ఎ), చీట్లువేసి ఆయన వస్త్రాలు ఎలా పంచుకొంటారో (కీర్తన. 22:18 /మత్తయి 27:35బి, సి) ప్రాచీన లేఖనాలు ముందుగా తెలిపాయి. ఇంకను ముందుగా చెప్పబడిన వాటిలో, మరణ సమయాన ఆయన పలికే మాటలు (కీర్తన. 22:1/మత్తయి 27:46), ఆయన కాళ్లు విరుగగొట్టబడవు అనే సంగతి (కీర్తన. 34:20/యోహాను 19:33), ఆయన ప్రక్కలో బల్లెముతో పొడువబడుతుందనే విషయం (జెకర్యా 12:10/యోహాను 19:37), సమాధి (యెషయా 53:9/మత్తయి 27:57-60), ఆయన పునరుత్థానం (కీర్తన. 16:10/లూకా 24:1-9; అపొ. 2:25-32), ఆయన ఆరోహణం (కీర్తన.

68:18/లూకా 24:50-53) అనేవి కూడా ఉన్నాయి.

రక్షకుడు అవతరిస్తాడని చెప్పడం పోలికను బట్టి చూస్తే ప్రవక్తలకు చిన్న సంగతే. అయినా, వారు మూడు వందలకు పైగా వివరాలు దానిలో కలిపినప్పుడు, కాదనలేని ఒక నిశ్చయమైన రూపాన్ని అమర్చారన్న మాటే.

ఆ ప్రవచనాల నెరవేర్పు యొక్క భావమేమో ఆలోచించూ. మానవ జ్ఞానము మరియు దూరదృష్టి ఇరవైనాలుగు గంటలకు ముందు జరుగబోయే భవిష్యద్ విషయాలను సంపూర్ణమైన నిశ్చయతతో తెలుపలేవు. రాజకీయపరమైన రంగంలో ఎన్నికల లెక్కలుకట్టే వారు దేశవ్యాప్తంగా ఉన్న తమ ఏజెంట్ల మూలంగా కొన్ని సార్లు ఎన్నికల ఫలితాలను ముందుగా చెప్పవచ్చు! నేటినుండి నాల్గువందల సంవత్సరాల తరువాత ప్రసిడెంట్ ఎవడైయుంటాడు, అతని జన్మ స్థలము, అతని వంశావళి, అతని విద్యాభ్యాసము, తాను పనిలో ఉండే కాలము, తాను మరణించే స్థలము, మరణించే విధానం ప్రవచించితే ఎలాటిదో, ప్రభువైన యేసును గూర్చిన ప్రవచనాలు కూడా అలాటివే.

భవిష్యత్తులో జరుగబోయే సంగతులను గూర్చి అది తెలుపుతుంది గనుక, నిజమైన ప్రవచనాన్ని పరీక్షించవచ్చు. ఆకస్మిక సంభవంవలన నెరవేర్చబడలేని వివరాలు అది కలిగియుంటుంది. చారిత్రకమైన నెరవేర్పు తరువాతనే ప్రవచనం సరియైనదని గోచరిస్తుంది. వ్రాత రూపంగాగాని, లేదా పలుకు మూలంగాగాని ఉన్న ఏ రుజువు కూడా ప్రవచనపు నెరవేర్పు అనే వాదనను రద్దుపరచనేరదు. అది ఒక వైపు ప్రభువైన యేసు యొక్క దేవత్వాన్ని, మరోవైపు వాటిని వ్రాసిన మనుష్యులు దైవప్రేరేపితులని నిరూపిస్తుంది.

## దేవుడని తాను చెప్పకొన్నది తన కార్యములతో పొందిక కలిగియున్నది గనుక

ప్రభువైన యేసు తనవైయున్నట్టు కొన్ని సంగతులను గూర్చి ధైర్యముగా చెప్పు కొన్నాడు. అబ్రాహాముకు ముందే తాను ఉన్నట్టును (యోహాను 8:58), లోకము పుట్టక మునుపు ఆయన దేవునితో ఉన్నట్టును (యోహాను 17:5, 24), ఆయన పరలోకమునుండి దిగివచ్చి యున్నట్టును (యోహాను 6:38, 62), పరలోకమందును భూమిమీదను తనకు సర్వాధికారము ఉన్నట్టును (మత్తయి 28:18) ఆయన చెప్పుకున్నాడు. ఆయన గతంలో జీవించిన మనిషి యొక్క మరు జన్మ కాదు; కాని

ఆయన మానవ రూపంలో ఉన్న దేవుడైయున్నాడు (యోహాను 1:1-18). ఆయన దేవత్వాన్ని అంగీకరించనివారు ఆయనను కేవలం ఒక "మంచి" మనిషిగా గుర్తించారు. అయినా, ఆయన తన్ను గూర్చి ఏమని చెప్పుకున్నాడో అదే ఆయన అయ్యుండక పోయినట్లయితే, ఆయన అబద్ధికుడును మరియు వంచకుడునై యుంటాడేగాని తప్పక ఆయన "మంచి" మనిషియైయుండడు!

తన్ను గూర్చి తాను చెప్పుకొన్నవి సత్యమైనవని ఆయన పనులే చూపుతున్నాయి. ప్రభువైన యేసు అనేకమైన అద్భుతాలు చేశారు. బైబిలు చరిత్రకారులు ఆయన అద్భుత కార్యాలను గూర్చి సాక్ష్యమిస్తున్నారు (మత్తయి 11:4, 5; యోహాను 20:30, 31). ఆయన అద్భుతాలు చేసినట్లు మతానికి సంబంధంలేని చరిత్రకారులు సహితం సాక్ష్యమిస్తున్నారు.

ఆయన పనులు ఆయన మాటలు ఒకటైయున్నాయి. "నేను లోకమునకు వెలుగైయున్నాన"ని చెప్పి (యోహాను 8:12ఎ), ఆయన గుడ్డివానికి చూపునిచ్చాడు (మత్తయి 9:6, 7). "నేను జీవాహారమునైయున్నానని" చెప్పి (యోహాను 6:35ఎ), ఆయన అయిదు రొట్టెలను రెండు చేపలతో అయిదు వేల మందికి ఆహారం పెట్టాడు. "నేను పునరుత్థానమును జీవమునైయున్నానని చెప్పి" (యోహాను 11:25ఎ), ఆయన లాజరును మృతులలోనుండి లేపాడు (యోహాను 11:43, 44).

## ఆయన పాపరహితమైన జీవితాన్ని జీవించాడు గనుక

ప్రభువైన యేసును ఎరిగినవారు, ఆయన పాపరహితుడై జీవించినట్టు చెప్పారు. ఈ మనుష్యులు దేవునిచే ప్రేరేపింపబడినవారై యున్నారు!

> మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలో మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేని వాడుగా ఉండెను (హెబ్రీ. 4:15).

> ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు (1 పేతురు 2:22).

ఆయన జీవితాన్ని గూర్చి శ్రద్ధగా పరిశీలించి తెలిసికొన్నవారు ఆయనను ఉత్తముడు లేక సత్పురుషుడుగా భావించారు (లూకా 18:18). నిరంతరము తనయందు దోషము కనిపెట్టాలని యత్నించిన తన శత్రువులు సహితం ఆయన మంచితనాన్ని ఎరిగిన

వారైయున్నారు. ఆయన బహు అసాధారణమైన పనిని చేశాడు. ఏమంటే-తనలో ఏమైనా దోషమున్నదేమో పరీక్షించి చూడమని వారిని సవాలు చేశాడు (యోహాను 8:46ఎ).

ఆయన యొక్క మంచితనం ఆయన మరణ సమయాన గుర్తించబడింది. పిలాతు భార్య (మత్తయి 27:19), పిలాతు (మత్తయి 27:23), హేరోదు (లూకా 23:14), సిలువ మీద దొంగ (లూకా 23:41), శతాధిపతి (మత్తయి 27:54), కడకు యూదా సహితం పలికిన మాటలను యోచించి చూడు (మత్తయి 27:4).

## లోకంపై ఆయన జీవిత ప్రభావం నిరంతరం ఉంది గనుక

అనేక జ్ఞాపకార్థ చిహ్నాలు ఆయన జీవితాన్ని ఘనపరచుతూ ఉన్నాయి: ప్రభువు దినం (ప్రకటన 1:10), ప్రభురాత్రి భోజనం (1 కొరింథీ. 11:20-29; మత్తయి 26:26-28), బాప్తిస్మం (రోమా 6:3-5), మరియు మన క్యాలండరులోని తేదీలు సహా (క్రీ. పూ.; క్రీ.శ.) ఆయనకు జ్ఞాపకాలుగా నిలిచియున్నాయి. మానవుడు గొప్పతనంగా ఎంచే ఏ ఒక్క దానితో కాక, నిస్సందేహముగా, ఆయన లోకంలో అత్యంత గొప్ప పురుషుడే. ఆయనకు గొప్ప పిత్రార్జితంగాని, సంప్రదాయ సిద్ధమయిన విద్యగాని లేదు (యోహాను 7:15), ధనం లేదు, రాజకీయంగాగాని, సైనిక సంబంధంగా గాని, ఏ అధికారం లేదు, క్రీడారంగంలో శౌర్యంగాని లేదు; అయినా, గత యిరవై శతాబ్దాలుగా మానవ జాతిపై ఆయనకున్న పలుకుబడి ఎవడూ ప్రశ్నించ లేదు. ఆయన కేవలం మానవ మాత్రుడే అయ్యుంటే, నేడు ఆయనకంటే ఘనుడైన వానిని లోకం కలిగియుండదా? పురోభివృద్ధిని సాధించడానికి గాను లోకానికి రెండు వేల సంవత్సరాలున్నాయి. వృద్ధిచెందిన మన పాండిత్యంలో లేక విద్యాసాధనలో, నిజమైన నాయకత్వం కొరకు లోకం ఆకలిగొనియుంది. అయితే ప్రతిఒక్కరు ప్రభువైన యేసు వైపు చూడవచ్చు, ఆయనే మార్గమైయున్నాడు. నరులందరికి ఆయన చాలినవాడై యున్నాడు. “ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును” (యెషయా 9:6బి).

## ముగింపు

తప్పక, యేసు దేవుని కుమారుడైయున్నాడు. ఆయన దేవుని కుమారుడని నమ్ముడానికిగాను ఈ కారణాలను యింకను పరీక్షించి చూడు. ఆయన అలాగే అయ్యున్నాడని నమ్ముతూ, ఆయన ద్వారా నీ జీవితాన్ని దేవునికి సమర్పించుకో.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 248వ పేజీలో*)

1. క్రైస్తవ్యం యొక్క కేంద్రస్థానంలో ఏ సత్యం నిలిచియుంది?
2. ప్రభువైన యేసు యొక్క జననం, జీవితం, మరణం అనేవి గొప్ప వివరంగా ప్రవచించబడ్డాయి. కొన్ని ఉదాహరణలిమ్ము.
3. నెరవేర్చబడిన ప్రవచనాలు ప్రభువైన యేసును ఏమని రుజువు చేస్తాయి?
4. తన్ను గూర్చి ప్రభువు అబ్బురమైన, ధైర్యముగల సంగతులను చెప్పుకొన్నారు. వాటిలో కొన్ని ఏవి?
5. ప్రభువైన యేసు మాటలు ఆయన పనులతో ఎలా ఏకీభవిస్తున్నాయి?
6. ప్రభువు యొక్క మంచితనం ఎలా గుర్తించబడిందో కొన్ని ఉదాహరణలిమ్ము.
7. మన లోకంపై ఆయన జీవితం తన ప్రభావాన్ని ఎలా కొనసాగిస్తుంది?

## పద సహాయకారి

**ఆరోహణము –** పైకి ఎగయు, పైకి కొనిపోబడు, క్రీస్తు మృతులలోనుండి లేపబడిన తరువాత, దేవునితో కూడ ఉండుటకు ఆయన పరలోకమునకు చేర్చుకొనబడిన సంఘటనను ఆరోహణమంటారు.

**దేవుడు –** దేవుడు; దేవుని స్వభావం, దేవుడైయుండడం.

**వంశావళి –** పితరులయొక్క జాబితా, ప్రభువైన యేసుయొక్క వంశావళి (మత్తయి 1:1–16) దేవుడు వాగ్దానం చేసినవాటిని గూర్చిన ప్రవచనపు నెరవేర్పు ఆయనయే అయ్యున్నట్టు చూపుతోంది.

**ప్రభువు దినం –** వారంలో మొదటి దినం (ఆదివారం) క్రొత్త నిబంధన సంఘము యొక్క ఆరాధనా దినంగా ప్రత్యేకించబడింది (అపొ. 20:7).

**ప్రభురాత్రి భోజనం –** పులియని రొట్టె తినుట, ద్రాక్షారసము పుచ్చుకొనుటతో

కూడిన ఒక జ్ఞాపకార్థపు చిహ్నం ప్రభువువలన ప్రవేశపెట్టడం జరిగింది (1 కొరింథీ. 11:20, 23-26). క్రొత్త నిబంధన సంఘము వారంలో ప్రతి తొలి దినాన దీని నాచరించింది.

**పునరుత్థానము –** చనిపోయిన వ్యక్తి తిరిగి ప్రాణంతో బ్రతకడం. ప్రభువైన యేసు పునరుత్థానం, మరణంపై ఆయన అధికారియై యున్నట్టు రుజువు చేస్తుంది. మరియు ఆయన్ను వెంబడించిన వారు భూమిమీద ఈ జీవితాన్ని చాలించిన తరువాత ఆయనతో కూడ పరలోకంలో నిత్యముంటారు.